ఓంశ్రీసాయిరాం

సకల సద్గుణములు చక్కగా లేకున్న
వాడు నరుడుకాడు వాస్తవముగ
బాలబాలికల గుణములే భారతీయ
సంపదయని మీరు హృదయాన చింతింపరయ్య.

విద్యార్థులారా!

భారతీయ సంస్కృతియందు అనంతకాలమునుండి ధూపదీపనైవేద్యములతో దైవాన్ని ఆరాధిస్తూ, ఆనందిస్తూ, అర్చిస్తూ జీవితాన్ని గడుపుతూ వచ్చింది. దురదృష్టవశాత్తు ఈనాటి బాలబాలికలు ఇట్టి షోడసోపచారములైన సేవలు విస్మరించి కేవలము ఒక నామమునే ఆధారముచేసుకొని తన జీవితమును ఏదో తృప్తిపొందించుకుంటున్నామని భ్రమిస్తున్నారు. ఏది ముందు, ఏది వెనుకఅనే విచక్షణా జ్ఞానము కోల్పోయి ఈనాటి విద్యార్థులు తమతమ కర్తవ్యములను కొంత పెడమార్గమును పట్టించుకుంటున్నారు. భారతీయ సాంప్రదాయమునందు భుజించుటకు పూర్వము భగవంతునకు అర్పితముచేసి, ప్రాణాయస్వాహా, అపానాయస్వాహా, వ్యానాయస్వాహా, ఉదానాయస్వాహా, సమానాయస్వాహా అని ఐదు పర్యాయములు భగవంతునికి అర్పితముచేసి ఆ అర్పితమైన భోజనము ప్రసాదముగా స్వీకరించేవారు. దీనికి మూలకారణము సద్గుణములు, సత్ప్రవర్తనలు, సదాలోచనలు, సచ్చింతలు, సత్క్రియలు. భగవంతునికి అర్పితముగావించే సమయములో చక్కని పరిశుద్ధమైన ఆకుని తెచ్చి, ఆ ఆకులో వండిన మధురమైన పదార్థములనుంచి భగవంతునికి అర్పితముచేసేవారు. అర్పితము చేయటకు పూర్వము పాత్రశుద్ధి, పాకశుద్ధి, పదార్థశుద్ధిలేక వఉండవచ్చును. ఈ పాత్రశుద్ధి, పాకశుద్ధి, పదార్థశుద్ధిని మనము విచారించటము కష్టతరమైన విషయము.

బ్రహ్మార్పణం బ్రహ్మహవిర్ బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతం
బ్రహ్మైతేనగన్తవ్యం బ్రహ్మకర్మసమాధినా.

అంతయూ బ్రహ్మార్పణముగా భావించినప్పుడు అది ప్రసాదముగా రూపొందుతంది. పూర్వము మధురమైన పదార్థములతో కూడిన భోజనముగా వుండేది. భగవంతునికి అర్పితముగావించిన తరువాతఅది ప్రసాదముగా మారిపోతుంది. ఇట్టి పవిత్రమైన ప్రసాదము ఎవరు భుజించినా దోషముండదు.

అయితే ఈనాటి కాలానుగుణ్యముగా ఎట్టి ప్రసాదమును, ఎవరి ప్రసాదమును ఎవరికి అందిస్తున్నారు? మానవుని హృదయమనే దీనియందు వండిన సద్గుణములు, సదాచారములు, సత్ప్రవర్తన, సచ్చింతన, ఇలాంటివన్నీ దేహమనే అరిటాకులో వడ్డిస్తున్నాము. కాని, ఎవరికి మొదలు నైవేద్యము చేస్తున్నాము? దుర్గుణములు, దురాలోచనలు, దుస్సంపద, క్రోధము, ద్వేషము, అసూయ ఇత్యాది రాక్షసుల కర్పితముచేసి తదుపరి రాక్షసుల ప్రసాదమును భగవంతునికి అందిస్తున్నారు. ఇలాంటి రాక్షసులకు అర్పితముచేసి, రాక్షసులు చక్కగా భుజించిన తరువాత, ఈ మిగిలిన ప్రసాదము భగవంతునికి అర్పితము చేస్తున్నారు. ఇదే ఈలిటి ఆధునిక యుగములో అనేక అశాంతులకు గురియై కష్టములకు, నష్టములకు, విచారములకు లోనై జీవితమును గడుపుతున్నారు. దుర్గుణములకు అర్పితముచేయకూడదు. దుర్గుణము దూరముచేసి మొట్టమొదట సద్గుణమునకు అర్పితముచేయాలి. 'ఓ దైవమా! నా హృదయస్థాయిందున్న దైవమా!నా ప్రేమస్వరూపమైన దైవమా! నా సర్వస్వరూపమైన దైవమా! దయామయుడైన దైవమా! ఇదిగో నా గుణములనే పంచభక్ష్యపరమాన్నములను నీకు అర్పితముచేస్తున్నాను. ఈ లేత వయస్సు చాలా మధురమైన ఫలమువంటిది. ఇటువంటి మధురమైన మనోఫలమును, హృదయఫలమును భగవంతునికి అర్పితము చేయాలి. ఎప్పుడో అన్నివిధములా శరీరము కూలిన తరువాత, ఇంద్రియముల పటుత్వము తప్పిన తరువాత, మనోభావాలు పెంచుకున్న తరువాత వృద్ధాప్యమునందో, రిటైర్ అయిన తరువాతో భగవంతుని పూజ చేస్తానంటే ఇది సాధ్యము కాదు. sart early, drive slowly, reach safely. ఈ లేతవయస్సునందే భగవత్ప్రార్థన సరైన రీతిగా ప్రారంభించాలి. శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శక్తులు మంచి పటుత్వముగా ఉండినప్పుడే మరీ పవిత్రమైన కార్యములో ప్రవేశించకుండిన ఇంక ఎప్పుడు మీరీ పవిత్రమైన కార్యములో ప్రవేశిస్తారు. ఈ ఇంద్రియములు పటుత్వము కూలిన తరువాత ఏమి చేయగలరు మీరు?

ప్రబలి కఫంబు కంఠమున బాధలు పెట్టెడు వేళ బంధువుల్
గబగబ బైటపెట్టుడిక లాభము లేదనువేళ కింకరుల్
దబదబ ప్రాణపాశములు లాగెడువేళల ఆలుబిడ్డలున్
లబలబ ఏడ్చువేళ తరమా హరినామము నోట పల్కగన్!

అప్పుడు సాధ్యమౌతుందా?